సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 27 । సెప్టెంబర్ । 2024



నిధుల దుర్వినియోగంపై..

జీజీహెచ్‌లో నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని కమ్యూనిస్టు నాయకులు డీసీపీని కోరారు.

- 8లో ▸



మహిళా పోరాట శక్తికి..

మహిళా పోరాట శక్తికి తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు ఐలమ్మ ప్రతీక అని అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.5 /23.0

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

మొక్కలు నాటి పిల్లలకు కానుకగా ఇవ్వాలి



ఖలీల్‌వాడి: హరితహారంలో భాగంగా పోలీస్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ భవనం సమీపంలో సీపీ కల్మేశ్వర్ గురువారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమ వంతుగా మొక్కలు నాటి.. తమ పిల్లలకు భవిష్యత్ కానుకగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీసీపీ (అడ్మిన్) బి కోటేశ్వర రావు, అదనపు పోలీస్ కమిషనర్ (ఏఆర్) శంకర్‌నాయక్, సూపరింటెండెంట్లు, సిబ్బంది, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఎస్సైలు, ఐటీ కోర్ సిబ్బంది, సీసీఆర్‌బీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

4న పీసీసీ అధ్యక్షుడి రాక

ఖలీల్‌వాడి: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన తరువాత మొట్టమొదటిసారిగా అక్టోబర్ 4న బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ జిల్లాకు రానున్నారని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర కో ఆపరేటీవ్ సొసైటీ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయనకు ఘన స్వాగతం పలుకుతామని పేర్కొన్నారు. ఈనెల 29న ఉదయం 11గంటలకు కాంగ్రెస్ కార్యాలయంలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్‌లు, నియోజకవర్గ కో ఆర్డినేటర్లు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పీసీసీ డెలిగేట్లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొంటారని మానాల మోహన్‌రెడ్డి తెలిపారు.



ఎన్నెన్నో అందాలు..

- పర్యాటకాభివృద్ధిపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ప్రాంతంలో ప్రకృతి రమణీయత
- పచ్చిక బయళ్లలో సంచరిస్తున్న జింకలు, వేసవిలో విదేశీ పక్షుల సందడి
- ప్రతిపాదనలకే పరిమితమైన బోటింగ్

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: చారిత్రక ప్రాధాన్యత కలిగిన జిల్లాలో పర్యాటక అభివృద్ధికి అవకాశాలున్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ పరిధిలో ఆహ్లాదకర వాతావరణం ఉంది. వన్యప్రాణులు కనువిందు చేస్తాయి. బాసర, కందకుర్తి వరకు గోదావరి ఒడ్డున వాతావరణం పర్యాటకానికి అనుకూలంగా ఉంది. శ్రీరాంసాగర్ నుంచి ఎగువన ఉన్న బాసర వరకు బోటింగ్, నందిపేట, డొంకేశ్వర్ మండలాల్లో రిసార్టులు నిర్మించాలనే ప్రతిపాదనలు ఏళ్లతరబడి ఉన్నాయి. అనేకసార్లు ఉన్నతాధికారులు వచ్చి పరిశీలించి సర్వేలు సైతం చేయించారు. ప్రభుత్వాలు పలుసార్లు పర్యాటకాభివృద్ధిపై ప్రకటనలు చేసినప్పటికీ కార్యరూపం మాత్రం దాల్చలేదు.

■ జిల్లాలోకి గోదావరి నది కందకుర్తి వద్ద ప్రవేశిస్తుంది. ఇక్కడ మంజీర, హరిద్రా నదులు గోదావరిలో కలుస్తాయి. మూడు నదులు కలిసే ప్రాంతం కావడంతో త్రివేణి సంగమంగా ప్రసిద్ధి పొందింది. ఇక్కడ భక్తులు పవిత్ర స్నానాలు చేస్తారు. ఇక కందకుర్తిలో ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు హెడ్గేవార్ పూర్వీకుల ఇల్లు ఇప్పటికీ ఉంది. సంఘ్ ఆధ్వర్యంలో స్మృతిమందిరం నిర్మాణంలో ఉంది. గోదావరి ఒడ్డున పర్యాటకాభివృద్ధికి అన్ని అవకాశాలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం లేదు.

■ సహజసిద్ధ ప్రకృతి రమణీయత కలిగి ఉన్న శ్రీరాంసాగర్ జలాశయం, ఎగువ ప్రాంతంలో పర్యాటకాభివృద్ధికి కొద్దిగా మెరుగులు దిద్దితే పర్యాటకుల సంఖ్య మరింత పెరుగుతుంది. ఎస్సారెస్పీ వరద గేట్లు, చుట్టుపక్కల ప్రాంతాలు అందంగా ఉంటాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి మిగులు జలాలు గోదావరి దిగువకు వదిలేందుకు ఉన్న 42 వరద గేట్లు పెద్ద ఆకర్షణ. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం అయ్యాక పర్యాటకాభివృద్ధికి రూ.50 కోట్లతో ప్రతిపాదనలు చేసింది. అయితే ఆ ప్రతిపాదనలు అక్కడికే పరిమితమయ్యాయి.

■ శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ప్రాంతంలో ఎకోటూరిజం కోసం గత కేసీఆర్ ప్రభుత్వం 2023లో పలు అంశాలను ప్రకటించింది. డొంకేశ్వర్, నందిపేట్, బాల్కొండ మండలాల్లో మూడు చోట్ల కలిపి మొత్తం 26 ఎకరాల ప్రభుత్వ స్థలాలను కేటాయించింది. అత్యధికంగా డొంకేశ్వర్ మండలం గాదేపల్లిలో 18 ఎకరాలు కేటాయించింది. భూసేకరణ, హద్దులు గుర్తించడానికి పలుమార్లు ఫారెస్టు, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు కలిసి జాయింట్ సర్వేను నిర్వహించారు. హైదరాబాద్ నుంచి ఫారెస్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు పచ్చికబయళ్లలో పర్యటించి స్థలాలను పరిశీలించారు.

■ ప్రతి ఎండాకాలంలో జలాశయంలో నీరు తగ్గిపోవడంతో పచ్చదనం పరుచుకుని ఆహ్లాదకర వాతావరణం నెలకొంటుంది. వన్య ప్రాణులైన జింకలు, నక్కలు, కుందేళ్లు, నెమళ్లు, విదేశీ పక్షుల సందడి నెలకొంటుంది. వీటిని చూసేందుకు దూర ప్రాంతాల నుంచి ప్రజలు వస్తారు. వన్య ప్రాణులు, ప్రకృతిని తిలకించడానికి పర్యాటకుల కోసం నది ఒడ్డున వ్యూ పాయింట్లు, రెస్టారెంట్లు, రిసార్టులతో పాటు పార్కింగ్‌ను కూడా ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రణాళికను తయారు చేశారు. కాగా కార్యరూపం మాత్రం దాల్చలేదు. ఇప్పటికైనా ఇక్కడ ఎకోటూరిజం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇందుకు రూ.5 కోట్ల నిధులు అవసరమని అధికారులు అంచనా వేస్తున్నారు.

చేప పిల్లల పంపిణీలో కోత

- గతేడాది 4.58 కోట్ల చేప పిల్లలను వదిలిన అధికారులు
- ఈ ఏడాది 2.27 కోట్లకే అనుమతి
- మత్స్యకారుల అసంతృప్తి



డొంకేశ్వర్(ఆర్మూర్): మత్స్యకారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్న చేపపిల్లల్లో కోత విధించారు. ఈ ఏడాది జిల్లాలోని చెరువుల్లో 4.54కోట్ల చేప పిల్లలను వదలడం లక్ష్యంకాగా, రాష్ట్ర ప్రభుత్వం యాభై శాతానికే అనుమతిచ్చింది. ఫలితంగా 2.27లక్షల చేపపిల్లలను మాత్రమే 967 చెరువుల్లో వదిలేందుకు మత్స్య శాఖ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. గతేడాది 4.58కోట్ల చేపపిల్లలను 1,018 చెరువుల్లో వదలగా, ఈ ఏడాది చేప పిల్లలతోపాటు చెరువుల సంఖ్యనూ తగ్గించడంతో మత్స్యకార సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. చెరువుల్లో చేపలు లేకపోతే తమకు ఉపాధి తగ్గుతుందని వాపోతున్నారు.

టెండర్లు ఇలా..

చేప పిల్లల సరఫరా కోసం అధికారులు ఇటీవల టెండర్లు పూర్తి చేయగా, నలుగురు వ్యక్తులు పాల్గొన్నారు. ముగ్గురు టెండర్‌ను దక్కించుకోగా, 35 నుంచి 40 ఎంఎం, 80 నుంచి 100 ఎంఎం సైజు చేప పిల్లలను కాంట్రాక్టర్లు చెరువుల్లో వేయాలి. 35 నుంచి 40ఎంఎం సైజ్ ఉన్న ఒక్కో చేపపిల్లను 66 పైసలకు, 80 నుంచి 100 ఎంఎం సైజ్ ఉన్న చేపపిల్లలను రూ.1.76 పైసలకు టెండర్ దక్కించుకున్న వారు సరఫరా చేయనున్నారు. ప్రస్తుతం చెరువుల్లో చేపపిల్లలను వదలాల్సి ఉండగా, గుత్తేదార్లు ఆలస్యం చేస్తున్నారు. గతంలో చేప పిల్లలను సరఫరా చేసిన బిల్లులు రాలేదని, అవి వచ్చిన తరువాత ఈ ఏడాది సరఫరా చేస్తామని అధికారులతో స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉండగా, సమస్యను పరిష్కరించి త్వరలోనే చేప పిల్లల పంపిణీని ప్రారంభిస్తామని జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయులు 'సాక్షి'తో అన్నారు.

ఎస్సారెస్పీలోకి పోటెత్తిన వరద

- 22 వరద గేట్ల ఎత్తివేత
- 82 వేల క్యూసెక్కుల నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి వరద మళ్లీ పోటెత్తింది. బుధవారం రాత్రి ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో గురువారం ఉదయం నుంచి క్రమంగా 70 వేల క్యూసెక్కులు, 90 వేల క్యూసెక్కులకు ఇన్‌ఫ్లో పెరుగుతూ.. రాత్రి సమయానికి లక్షా 10 వేల క్యూసెక్కులకు చేరింది. పెరిగింది. 22 వరద గేట్ల ద్వారా 82 వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. వరద కాలువకు 19 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 6,800, లక్ష్మి కాలువకు 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎస్కేప్ గేట్ల ద్వారా 1200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరుపోతోంది. మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091 (80.5 టీఎంసీలు) అడుగులు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

కొనసాగుతున్న విద్యుదుత్పత్తి

కాకతీయ కాలువ, ఎస్కేప్ గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతుండటంతో విద్యుదుత్పత్తి కేంద్రంలోని నాలుగు టర్బయిన్‌ల ద్వారా 36.45 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 19.10 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు జెన్‌కో అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

సీఐల బదిలీ

ఖలీల్వాడి: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఐదుగురు సీఐలను బదిలీ చేస్తూ గురువారం రాత్రి సీపీ కలేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఆర్బీ సీఐ శ్రీనివాస్ రాజును ఒకటో టౌన్ ఎస్ హెచ్ వోగా బదిలీ చేయగా నిజామాబాద్ టౌన్ సీఐగా ఉన్న నరహరిని ఐజీ ఆఫీస్ కు అటాచ్ చేశారు. ఐజీ ఆఫీస్ లో ఉన్న రఘుపతిని ఒకటో టౌన్ సీఐగా బదిలీ చేశారు. ఒకటో టౌన్ సీఐగా ఉన్న ఎస్ హెచ్ వో విజయ్ బాబును బోధన్ రూరల్ సీఐగా బదిలీ అయ్యారు. బోధన్ రూరల్ సీఐని కోలా నరేశ్ కుమార్‌ను ఐజీ ఆఫీస్ కు అటాచ్ చేశారు.

30న ఉమ్మడి జిల్లా ఎస్‌జీఎఫ్ ఆర్చరీ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ ఆర్చరీ క్రీడకు సంబంధించి ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు అండర్–14, 17 బాలబాలికల విభాగంలో ఈ నెల 30న జిల్లా కేంద్రంలోని రాజారాం స్టేడియంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు క్రీడల కార్యదర్శి నాగమణి గురువారం తెలిపారు. మరిన్ని వివరాలకు 7036915136 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

స్విమ్మింగ్ పోటీలు..

ఎస్‌జీఎఫ్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సంబంధించి స్విమ్మింగ్ అండర్–11, 14, 17 బాలబాలికల విభాగంలో స్కేటింగ్ ఎంపికలు ఈ నెల 30న నగరంలోని సుభాష్‌నగర్‌లోని స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో ఎంపికలు ఉంటాయని క్రీడల కార్యదర్శి నాగ మణి తెలిపారు. మరిన్ని వివరాలకు 8333 947957 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేషనల్ హ్యాండ్‌బాల్‌కు..



నిజామాబాద్‌నాగారం: హైదరాబాద్‌లో అక్టోబర్ 3నుంచి నిర్వహించనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎల్లారెడ్డికి చెందిన ఎం గణేశ్ ఎంపికయ్యాడు. రాష్ట్ర హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14, 15తేదీల్లో హన్మకొండలో నిర్వహించిన 38వ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో గణేశ్ ఉత్తమ ప్రతిభకనబర్చి నేషనల్స్‌కు ఎంపికయ్యాడు. హ్యాండ్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గంగామోహన్ చక్రు, కార్యదర్శి పింజా సురేందర్ క్రీడాకారుడిని అభినందించారు.

నేడు, రేపు జిల్లా స్థాయి స్కేటింగ్ ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28వ తేదీల్లో జిల్లాస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి రామచందర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ స్విమ్మింగ్‌పూల్ ఆవరణలో ఉన్న స్కేటింగ్ కోర్టులో పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9182339154, 9121815515 నంబర్లను సంప్రదించాలన్నారు.

మహిళా పోరాట శక్తికి ప్రతీక ఐలమ్మ

- అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్
- కలెక్టరేట్‌లో ఐలమ్మ జయంతి వేడుకలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

నిజామాబాద్‌అర్బన్: మహిళా పోరాట శక్తికి తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ప్రతీక అని అదనపు కలెక్టర్ ఎస్ కిరణ్‌కుమార్ అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ 129వ జయంతిని గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఉన్న ఐలమ్మ విగ్రహానికి నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నగర మేయర్ దండు నీతూకిరణ్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిన వీరవనిత ఐలమ్మ అని కొనియాడారు. ఆమె పోరాట స్ఫూర్తి నేటితరానికి ఆదర్శణీయమని అన్నారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్, ప్రధాన కార్యదర్శి ఫతేపూర్ నరేశ్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నల్లగంటి శ్రీలత, రాష్ట్ర కార్యదర్శి చెప్యాల భిక్షపతి, సామాజిక కార్యకర్త బంగారు సాయిలు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్సా ఆంజనేయులు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివద్ధి అధికారి డి రమేశ్, సహాయ అభివృద్ధి అధికారులు పి నర్సయ్య, సి గంగాధర్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి



ఫిర్యాదు చేస్తున్న ఐఎఫ్‌టీయూ నేత సుధాకర్, నాయకులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో నిధుల దుర్వినియోగంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) నాయకులు అడిషనల్ పోలీస్ కమిషనర్ కోటేశ్వరరావుకు గురువారం వినతి పత్రం అందజేశారు. నిధులను రికవరీ చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజాపంథా నగర కార్యదర్శి ఎం సుధాకర్ మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ విభాగం ఉద్యోగుల నిర్లక్ష్యం కారణంగా జీజీహెచ్‌కు రూ.10 కోట్ల వరకు నష్టం వాటిల్లిందన్నారు. రోగులతోపాటు వారి సహాయకులకు నాసిరకం భోజనం పెడుతున్నారని, అధికారులు, సిబ్బంది, కాంట్రాక్టర్లు కుమ్మక్కయ్యారని ఆరోపించారు. రోగులను ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నార్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె గణేశ్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బి మురళి, టి విఠల్, పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబా, పీవోడబ్ల్యూ నాయకులు అమూల్య, లలిత, పీడీఎస్‌యూ నాయకులు మహిపాల్, నసీర్, మణెమ్మ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు దిశా సమావేశం

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా అభివృద్ధి సమన్వయ, మానిటరింగ్ (దిశా) కమిటీ సమావేశాన్ని ఈ నెల 28న (శనివారం) నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు ఎంపీ ధర్మపురి అర్వింద్ అధ్యక్షతన సమావేశం ఉంటుందని, కేంద్ర ప్రభుత్వం వివిధ పనుల కోసం ఆయా శాఖలకు కేటాయించిన నిధులు, వాటి వినియోగంపై సమీక్షిస్తారని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు దిశా సమావేశానికి హాజరు కావాలని డీఆర్డీవో కోరారు.

విద్యాభివృద్ధికి కృషి చేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని వంశీ ఇంటర్నేషనల్ హోటల్లో పట్టభద్రులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టభద్రులందరూ మంచి విద్యావేత్తగా ఆలోచించి తనను గెలిపించాలని కోరారు. ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాల అసోసియేషన్ వారు నరేందర్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ గెజిటెడ్ ఉపాధ్యాయ సంఘం, బీసీ ఉపాధ్యాయ, ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నాయకులు నరేందర్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమానులు, ప్రభుత్వ టీచర్లు, లెక్చరర్లు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి సైన్స్ మేళా



నిజామాబాద్‌అర్బన్: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా నగరంలోని మాణిక్‌భవన్ పాఠశాలలో గురువారం జిల్లా స్థాయి సైన్స్ మేళా నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఈనెల 27న జిల్లా స్థాయి సైన్స్ యువజన ఉత్సవాల్లో బహుమతులు అందజేస్తామని జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న తెలిపారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం అధికారిణి శైలి బెల్లాల్, జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్, మాణిక్ భవన్ పాఠశాల హెచ్ఎం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గణపయ్యా.. మునగలేదేమయ్యా



జిల్లా కేంద్రంలో గణేశ్ నిమజ్జనం ఈ నెల 17న జరిగింది. నాలుగు ఫీట్ల వరకు ఉన్న గణనాథులను వినాయక్‌నగర్‌లోని గణపతి బావిలో నిమజ్జనం చేశారు. ఐదు ఫీట్ల కన్న ఎక్కువ ఉన్న గణనాథులను మాధవనగర్‌లో ఉన్న చెరువులో నిమజ్జనం చేయడానికి కార్పొరేషన్ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. అక్కడ భారీ క్రేన్‌ను పెట్టకపోవడంతో చెరువు ఒడ్డు అంచున వేసిన గణనాథులు ఇంకా కొద్దిపాటి నీటిపైనే తేలి ఉన్నాయి. ఈ విగ్రహాలను అక్కడి నుంచి తొలగించాలని భక్తులు కోరుతున్నారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ఉమ్మడి జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ జట్టు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ జిల్లా బాల్‌బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు సంబంధించి రాష్ట్ర స్థాయికి జిల్లా జట్టుకు ఎంపికలు నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు మానస గణేశ్, కార్యదర్శి శ్యామ్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. అక్టోబర్ 4 నుంచి 6వరకు కామారెడ్డిలో నిర్వహించే 69వ రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో విద్యాసాగర్‌రెడ్డి, రవి, రాము, కృష్ణమూర్తి, రాజేశ్వర్, మహేశ్, సురేష్, జ్యోత్స్న, భాగ్యలక్ష్మి, గీత, కార్తిక్, ఆనంద్, సాయికుమార్, అనిల్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్‌అర్బన్: ఉమ్మడి జిల్లా పరిధిలో డీఎస్సీ – 2008 తెలుగు విభాగంలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను శుక్రవారం నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు పరిశీలించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యాశాఖ ద్వారా ఎంపికైన అభ్యర్థులు గెజిటెడ్ ఆఫీసర్ ధ్రువీకరించిన తమ ఒరిజినల్ పత్రాలతో రావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నిర్ణీత తేదీల్లో అభ్యర్థులు ఉదయం 10:30 గంటలకు హాజరుకావాల్సి ఉంటుందని, అభ్యర్థుల జాబితా www. schooledu. telangana. gov. in లో పొందుపర్చినట్లు తెలిపారు.

పక్కా ప్రణాళికతో హత్య

- కళ్లల్లో కారం చల్లి.. కర్రలతో కొట్టి
- కంజర్‌లో కలకలం రేపిన హత్య ఉదంతం
- పోలీస్ బందోబస్తు మధ్య అంత్యక్రియలు
- పోలీసుల కస్టడీలో హంతకులు..!





నరహరి(ఫైల్), మృతుడి బంధువులతో



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మోపాల్: మండలంలోని కంజర్‌లో బుధవారం అర్ధరాత్రి గాజ నరహరి(55) హత్య కలకలం రేపింది. పక్కా ప్రణాళిక ప్రకారం మృతుడి కోసం ప్రత్యర్థులు కాపు కాసి, కళ్లల్లో కారం చల్లి కర్రలతో కొట్టి నడిరోడ్డుపై హత్యచేశారు. విషయం తెలుసుకున్న సీఐ సురేష్‌కుమార్, ఎస్సై యాదగిరిగౌడ్ సహా పలువురు ఎస్సైలు గ్రామంలో పికెటింగ్ నిర్వహించారు. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. గాజ నరహరికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు గోవర్ధన్‌కు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బోయిని లలితసత్యనారాయణ కుమార్తె వర్షతో గతంలో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. నాలుగు నెలల క్రితం భార్యాభర్తల మధ్య గొడవతో భార్య వర్ష ఆత్మహత్య చేసుకుంది. ఆ కేసులో నెలన్నర క్రితం వరకు గోవర్ధన్, నరహరి జైలులో ఉన్నారు. ఈక్రమంలో పిల్లలకు తండ్రి ఆస్తి ఇచ్చే విషయంలో ఇరు కుటుంబాల పంచాయితీ జరుగుతోంది. చర్చలు కొలిక్కి రాకపోవడానికి నరహరి కారణమని సత్యనారాయణ కుటుంబం నిర్ధారణకు వచ్చి ఆయన హత్యకు పథకం రచించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

నిమిషమైతే ఇంట్లోకి..

నరహరిని హత్య చేయాలని సత్యనారాయణ కుటుంబీకులు ప్రణాళిక చేశారు. ఆ మేరకు బుధవారం రాత్రి కొందరు నరహరి ఇంటికి వచ్చి పిలిచినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంట్లో భార్య మాత్రమే ఉన్నట్లు, కుమారుడు సైతం వేరే గ్రామానికి వెళ్లినట్లు నిర్ధారించుకున్నారు. నరహరి ప్రతి అడుగును గమనిస్తూ వచ్చారు. ఆయన నిమిషమైతే ఇంట్లోకి చేరుకుంటాడనుకునే సమయంలో అక్కడే ఉన్న సత్యనారాయణ కుటుంబానికి చెందిన మహిళలు ఒక్కసారిగా కళ్లల్లో కారం చల్లారు. అక్కడే కింద పడిపోయిన నరహరిని సత్యనారాయణ, ఆయన కొడుకు, మరికొందరు కర్రలతో తలపై దాడి చేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నరహరిని కొడుతున్న విషయం ఆయన భార్య.. పెద్ద కొడుకు గోపికి సమాచారమివ్వగా ఆయన హుటాహుటిన అక్కడికి చేరుకోగా ఆయనకూ కళ్లల్లో కారం చల్లినట్లు ఆరోపణలు ఉన్నాయి.

హంతకులను శిక్షించాలని డిమాండ్

తన తండ్రిని హత్య చేసిన హంతకులను కఠినంగా శిక్షించాలని, గతంలో తమ ఇంటి నుంచి దోచుకెళ్లిన ధ్రువపత్రాలు, బంగారం, డబ్బులు తిరిగి ఇవ్వాలని మృతుడి కుటుంబీకులు డిమాండ్‌చేశారు. అప్పటి వరకు అంత్యక్రియలు నిర్వహించేది లేదని భీష్మించారు. ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి, సీఐ సురేష్‌కుమార్, ఎస్సై యాదగిరిగౌడ్ ఆధ్వర్యంలో స్పెషల్ ఫోర్స్ బందోబస్తు చేపట్టింది. బాధితుల డిమాండ్లను పరిష్కరిస్తానని సీఐ హామీ ఇవ్వడంతో పోలీస్ బందోబస్తు మధ్య నరహరి అంత్యక్రియలు గురువారం ముగిశాయి.

నరహరిని హత్య చేసిన మాజీ సర్పంచ్ లలితసత్యనారాయణ, పూజిత, బాలకృష్ణ, సందీప్, మహేశ్, వంశీతోపాటు మరికొందరిపై పోలీసు లు హత్య కేసు నమోదుచేశారు. ప్రస్తుతం వారు పోలీస్ కస్టడీలో ఉన్నట్లు తెలిసింది.

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి



కన్నయ్య(ఫైల్)

నందిపేట్: మండల కేంద్రంలోని రాజ్‌నగర్ దుబ్బ ప్రాంతానికి చెందిన పత్రిక కన్నయ్య(35) చెరువులో పడి మృతి చెందాడు. ఎస్సై హరిబాబు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. కన్నయ్య బుధవారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో ఇంటి నుంచి పనికి వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికిన ఆచూకీ లభ్యం కాలేదు. గురువారం స్థానికుల సమాచారం మేరకు ఊర చెరువులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కన్నయ్య నిమజ్జనం జరిగిన గణేశ్ విగ్రహాల ఇనుప చువ్వల కోసం చెరువులో వెతుకుతుండగా ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెంది ఉంటాడని పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కాలువలో జారిపడి ఒకరు..

ఖలీల్వాడి: ప్రమాదవశాత్తు కాలువలో జారిపడి ఒకరు మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని బోర్గాం(పి)లో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మిర్చి కంపౌండ్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఎర్రం అంజయ్య మూత్ర విసర్జన సమయంలో కాలువలో జారిపడి నీట మునిగి మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మూర్ఛ వ్యాధితో యువకుడు..



మహేశ్(ఫైల్)

మాక్లూర్: మూర్ఛ వ్యాధితో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మాక్లూర్‌మండలంలోని కల్లెడి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రంగం మహేశ్ అలియాస్ లారా(33) గ్రామంలో చికెన్ సెంటర్ నడుపుతూ, వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతను మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. బుధవారం ఇంట్లో చిన్నగొడవ జరిగితో ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం వ్యవసాయ పొలంలో వెతుకగా మహేశ్ విగతజీవిగా కనిపించాడు. కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పొలంలో ఉన్న సమయంలో మూర్ఛవ్యాధి రావడంతో మృతి చెందాడన్నారు. మృతుడి భార్య శరణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

హత్యకేసులో నిందితురాలికి జీవిత ఖైదు

కామారెడ్డి క్రైం: భర్తను చంపిన భార్యకు జీవిత ఖైదు విధిస్తూ కామారెడ్డి కోర్టు గురువారం తీర్పు వెల్లడించింది. వివరాలిలా ఉన్నాయి. పెద్దకొడప్‌గల్ మండలం కాస్లాపూర్ గ్రామానికి చెందిన తడకంటి సాయిలు(55) 2022జూన్10న హత్యకు గురయ్యాడు. డబ్బుల విషయంలో తరచ భార్యతో గొడవపడేవాడు. పెద్ద మనుషుల సమక్షంలో నచ్చజెప్పినా సాయిలు తీరు మారలేదు. గొడవలు పెరగడంతో భర్తను చంపాలని అతని భార్య అంజవ్వ పథకం వేసింది. మద్యం సేవించి నిద్రలో ఉన్న భర్త సాయిలును దోతితో మెడకు ఉరి బిగించి హత్య చేసింది. పోలీసులు ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. నాటి నుంచి కేసు కోర్టు పరిశీలనలో ఉంది. పూర్వపరాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్ నిందితురాలికి జీవతఖైదుతోపాటు, రూ.2 వేల జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారు. కేసును సరైన పద్ధతిలో విచారించిన బిచ్కుంద సీఐలు కృష్ణ, నరేశ్‌కుమార్, ఎస్సైలు విజయ్‌కొండ, మురళీ, మహేందర్, సిబ్బంది మురళీ కృష్ణ, రవిలను ఎస్పీ సింధూ శర్మ అభినందించారు.

వాట్సాప్ మెసేజ్ వివాదాస్పదం

మోపాల్: మండలంలోని ఓ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు పదోతరగతి విద్యార్థినికి పంపిన వాట్సాప్ మెసేజ్ వివాదాస్పదంగా మారింది. రాత్రి సమయంలో విద్యార్థినికి మెసేజ్ పంపడంపై తల్లిదండ్రులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ గురువారం పాఠశాలకు వచ్చి సదరు ఉపాధ్యాయుడిని నిలదీశారు. వాట్సాప్ మెసేజ్‌లు పంపడంపై తల్లిదండ్రులు మూడు రోజుల క్రితం హెచ్‌ఎంకు ఫిర్యాదు చేశారు. నాటి నుంచి ఆంగ్ల ఉపాధ్యాయుడు సెలవులో ఉండగా, తల్లిదండ్రులు ఎలాంటి చర్యలు తీసుకున్నారని హెచ్‌ఎంపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ క్రమంలో గురువారం సదరు ఉపాధ్యాయుడు పాఠశాలకు వచ్చిన విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు, యువకులు అక్కడికి చేరుకున్నారు. ఉపాధ్యాయుడి సెల్‌ఫోన్‌ను లాక్కొని వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఇరువురిని పీఎస్‌కు పిలిపించారు. దురుద్దేశంతో మెసేజ్‌లు చేయలేదని, మరోసారి మెసేజ్‌లు చేయనని చెప్పడంతో గొడవ సద్దుమణిగినట్లు తెలిసింది. కాగా ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్సై రమేశ్‌బాబు తెలిపారు.

యువకుడి అదృశ్యం



పురుషోత్తం(ఫైల్)

బాల్కొండ: మోర్తాడ్ మండలం పాలెం గ్రామానికి చెందిన గున్నాల పురుషోత్తం అనే యువకుడు అదృశ్యమైనట్లు ఎస్సై విక్రమ్ గురువారం తెలిపారు. పాలెం గ్రామానికి చెందిన పురుషోత్తం ఈ నెల 24న ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. పురుషోత్తం భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చిక్లీలో ఒకరు..



వెంకట్

మాక్లూర్: మండలంలోని చిక్లి గ్రామానికి చెందిన దండ్ల వెంకట్ అదృశ్యమైనట్లు ఎస్సై రాజశేఖర్ గురువారం తెలిపారు. ఈ నెల 23న ఇంటి నుంచి వెళ్లిన వెంకట్ తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. తల్లి సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భిక్కనూరులో వృద్ధురాలు ..

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన బత్తుల బాలవ్వ అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. బాలవ్వ కొన్నేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతోంది. ఈనెల 23న ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుమారుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత

సదాశివనగర్: మండలంలోని వజ్జపల్లిలో ఎక్సైజ్ పోలీసులు గురువారం గంజాయిని పట్టుకొని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారం మేరకు వజ్జపల్లికి చెందిన రాజు అనే వ్యక్తి వద్ద వంద గ్రాములు, యాచారం తండాకు చెందిన తిరుపతి వద్ద 70 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఎస్సై విక్రమ్ తెలిపారు. విచారణ కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు.

హిందీ టీచర్ ఆత్మహత్య

బాన్సువాడ రూరల్: మండలంలోని సంతోష్‌నగర్ తండాకు చెందిన ప్రమీలా(40) అనే హిందీ టీచర్ గురువారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ప్రమీలా స్థానిక కొత్తాబాది జెడ్పీ హైస్కూల్‌లో ప్రభుత్వ హిందీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆమె కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తుల ద్వారా తెలిసింది. బాన్సువాడ రూరల్, టౌన్ సీఐలు సత్యనారాయణగౌడ్, మండలి అశోక్ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమీలా స్వగ్రామం బోధన్ మండలం ఊటపల్లి కాగా ఆమె భర్త రవీంద్రనాయక్ నాగిరెడ్డిపేట్ మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వీరికి ఏడేళ్ల కుమార్తె ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

తాడ్వాయి: ఆర్థిక ఇబ్బందులో ఓ వివాహిత ఆత్మహత్య చేసు కున్న ఘటన తాడ్వా యి మండలంలోని కృష్ణాజివాడలో చోటు చేసుకుంది. ఎస్సై వెంకటేశ్వర్లు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజివాడి గ్రామానికి చెందిన సాకలి సాయవ్వ(37) పెద్ద సాయిలు భార్యాభర్తలు. సాయిలు ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లినా ఆర్థిక ఇబ్బందులు తీరకపోవడంతో బుధవారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబీకులు ఆ స్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జెన్‌కో ఉద్యోగుల నిరసన



బాల్కొండ: రామగుండంలో నూతనంగా నిర్మించే 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ప్లాంటును జెన్‌కో, సింగరేణి భాగస్వామ్యంతో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని నిరసిస్తూ గురువారం జెన్‌కో కార్యాలయం ఎదుట జెన్‌కో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జెన్‌కో ద్వారానే నిర్మించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులు రఫీక్, తీష్, భరత్, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొని..

- ఒకరికి తీవ్రగాయాలు



బాల్కొండ: గుర్తు తెలియని వాహనాన్ని వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన ఘటన బాల్కొండ మండల శివారులో గురువారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆర్మూర్ నుంచి నిర్మల్ వైపు వెళ్తున్న రాజస్థాన్‌కు చెందిన లారీ బాల్కొండ మండల శివారులో గుర్తు తెలియని వాహనం సడెన్ బ్రేక్ వేసి నిలపడంతో వెనుకాలే వచ్చిన లారీ ఢీకొన్నది. ఈ ఘటనలో లారీ ముందు భాగం నుజ్జునుజ్జు కాగా క్యాబిన్‌లో ఇరుక్కున్న డ్రైవర్ కాలు విరిగింది. ప్రమాద ఘటనతో గుర్తు తెలియని వాహనం అక్కడి నుంచి పరారైంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ను హైవే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. బాల్కొండ పో లీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళను కాపాడిన పోలీసులు

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళను రైల్వే పోలీసులు కాపాడారు. రైల్వే ఎస్సై సాయారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డికి చెందిన తోమాటి ప్రియాంకకు ఐదేళ్ల క్రితం బాన్సువాడకు చెందిన సంతోష్‌తో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలంగా భర్త వేధింపులు తట్టుకోలేక ప్రియాంక ఆత్మహత్య చేసుకుందామని నిర్ణయించుకుంది. గురువారం తండ్రికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలిపింది. వెంటనే తండ్రి బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు మొబైల్ నంబర్ ద్వారా ట్రాక్ చేయగా నిజామాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తించారు. వెంటనే తమకు సమాచారం అందించడంతో సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని ప్రియాంకను రక్షించారు. అనంతరం ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇద్దరిపై కేసునమోదు

బోధన్‌టౌన్: పట్టణంలో గంగవ్వ అనే మహిళ మెడలోంచి బంగారు గొలుసు చోరీ చేయడా నికి యత్నించిన ఇద్దరు మహిళలపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకట నారాయణ తెలిపారు. కామారెడ్డి జిల్లా బండపల్లికి చెందిన గంగవ్వ పెళ్లి సామగ్రి కొనుగోలుకు బోధన్‌కు వచ్చింది. తిరిగి బాన్సువాడకు వెళ్లేందుకు బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా వెనుకాలే ఉన్న మహిళలు బంగారు గొలుసును దొంగిలిస్తుండగా స్థానికులు గమనించి పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.